సైనిక అమరులకు నివాళి

నేరేడుచర్లలో కర్నల్ సంతోశ్‌బాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాసవి, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, జూలై 26 : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అమర సైనికులకు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన కర్నల్ సంతోశ్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనారాయణ, వ్యాపారవేత్తలు అంజయ్య, సత్యనారాయణ, పుల్లయ్య, నటరాజ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కృపాకర్, గోపాలకృష్ణ ఉన్నారు.

బొడ్రాయిబజార్ : పట్టణ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని కర్నల్ సంతోశ్‌బాబు విగ్రహం వద్ద కార్గిల్ అమరులకు శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చల్ల లక్ష్మయ్య, గవర్నర్ రాచర్ల కమలాకర్, ఆర్సీ మీలా వాసుదేవ్, జడ్పీ బెలిదె శ్రీనివాస్, పబ్బది వేణు మాదవ్, కలకోట లక్ష్మయ్య, పబ్బతి ప్రవీణ్, శ్రీనివాస్, రమేశ్, నాగరాజు, శ్రీశైలం, తోట రమేశ్, ఉపేందర్, కృష్ణ, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం : మధుసూదన్‌రావు

కోదాడ టౌన్ : దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుండా మధుసుదన్‌రావు అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం పట్టణంలో కార్గిల్ అమరుడు గోపయ్యచారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, రమేశ్, సత్యనారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి : టీఆర్‌వీఎస్

బొడ్రాయిబజార్, జూలై 26 : దివ్యాంగుల పింఛన్ పెంచుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయాత పథకం కింద దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేల పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని టీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీమ్ డిమాండ్ చేశారు. సూర్యాపేటలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీ మరిచారన్నారు. సమావేశంలో జయకృష్ణ, అంజయ్య, రవి, ప్రభుకుమార్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను పూలమొక్కను అందిస్తున్నమాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, జూలై 26 : ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శరత్ చంద్ర పవార్‌ను సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ శుక్రవారం నల్లగొండలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పోలీస్ యంత్రాంగం అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి పనిచేయకుండా చట్టబద్ధంగా పని చేసేలా చూడాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పెద్దవూర మండలాధ్యక్షుడు రవినాయక్ ఉన్నారు.

సాగుకు అడ్డు పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

మిర్యాలగూడ, జూలై 26 : తన పట్టా భూమిలో సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కుట్టూరు వెంకట్‌రెడ్డి గోవిందమ్మ శుక్రవారం కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. దామరచర్ల గ్రామ శివారులోగల సర్వే నంబర్ 602/అలో 5.15 ఎకరాలు పట్టా భూమి కలిగి ఉందని 20 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నామని, అయితే ఫారెస్ట్ అధికారులు మూడ్రోజులుగాసాగుకు అడ్డు పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. 2003 సంవత్సరంలో కుట్టూరు నర్సిరెడ్డి నుంచి తన భార్య కుట్టూరు గోవిందమ్మ కొనుగోలు చేసిందని అప్పటి నుంచి వరి, మెట్టసాగు చేస్తున్నామన్నారు. 2015లో తన సమీప బంధువులు భూమిని ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారని, దీనిపై తాము కోర్టుకు వెళ్లగా ఫోర్జరీ జరిగినట్లు నిర్ధారించి తననే సాగు చేసుకోవాలని తీర్పు ఇచ్చిందని వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఈ విషయమై తాను ఈనెల 20న డీఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా అడ్డుకోవడంతో ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా దామరచర్ల తహసీల్దార్‌ను విచారించి తమకు న్యాయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు చేస్తున్న ఇబ్బందులను తొలగించి తాను వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని..

దామరచర్ల : మిర్యాలగూడ డివిజన్ పరిధిలో విరివిగా నాటిన కోనోకార్పస్ జాతి మొక్కలను తొలగించాలని కోరుతూ తెలంగాణ యువజన హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండారపు నాగేశ్వర్‌రావు శుక్రవారం మిర్యాలగూడలో ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ అమెరికాకు చెందిన కోనోకార్పస్ మొక్కలను హరితహారంలో గ్రామాల్లో రోడ్డు కిరువైపులా ఇష్టారాజ్యాంగ నాటు తున్నారన్నారు. వీటి వల్ల గ్రామాల్లో ప్రజలు, పశువులు, పక్షులు అనారోగ్యం పాలవు తున్నాయని వీటి ప్రభావంతో ప్రజలకు ఆరోగ్యాలకు ప్రమాదామని శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనంలో తేలిం ద న్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొండారపు శ్రీనివాస్ తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ, జూలై 26: మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలోని దిలావర్‌పూర్ రోడ్డు వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 5గంటల సమయంలో దిలావర్‌పూర్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ధనావత్ నాగు ఆటోలో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడ్ని విచారించగా ఏడుకోట్ల తండా వైపుగల వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి ఆటోలో తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి నాగుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళారత్న నేషనల్ అవార్డుకు గేయవర్ధిని ఎంపిక

మిర్యాలగూడ, జూలై 26: మిర్యాలగూడ పట్టణానికి చెందిన మెట్రో లెటర్స్ రైటర్ ప్రముఖ కళాకారి గుంటూరు గేయవర్ధిని కళారత్న నేషనల్ అవార్డు -2024 సంవత్సరానికి ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ వారు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని గేయవర్ధిని తండ్రి గుంటూరు శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబర్ 5న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డును గేయవర్ధినికి అందజేయనున్నట్లు తెలిపారు.

ఒక టీచర్.. ఐదుగురు విద్యార్థులు

కాల్వపల్లితండా ప్రాథమిక పాఠశాలలో హాజరైన ఐదుగురు విద్యార్థులు

మఠంపల్లి, జూలై 26 : సర్కారు విద్యపై ప్రజల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందనే భరోసా ఇటు ప్రభుత్వం, అటు ఉపాధ్యాయులు ఇవ్వకపోవడంతో చేసేది లేక తల్లిదండ్రులు రూ.వేలు ఖర్చు పెట్టి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. మఠంపల్లి మండలంలోని కాల్వపల్లితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక వెలవెల బోతున్నది. రెండు గదుల పాఠశాలలో మొత్తం ఐదుగురే విద్యార్థులున్నారు. రిజిస్టర్‌లో 10 మంది విద్యార్థుల పేర్లు నమోదై ఉన్నా.. ఒక ఉపాధ్యాయుడు, ఐదుగురు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో బడిబాట నిర్వహించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అవుతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు పట్టించుకొని ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించి ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను పెంచాలని తండా వాసులు కోరుతున్నారు.

'బీసీ రాష్ట్ర సమావేశాన్ని విజయవంతం చేయాలి'

నేరేడుచర్ల, జూలై 26 : ఈనెల 28న హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ముగ్దూం భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్ నందు జరుగనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర స్థాయి విస్తృత జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ జనగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం కుల శాతాన్ని బట్టి ప్రభుత్వ పథకాలు, రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. సమావేశంలో ఎల్లబోయిన సింహాద్రి, పున్నయ్య, చిలకరాజు శ్రీను తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి : ఐఎఫ్‌టీయూ

గరిడేపల్లి, జూలై 26 : భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు ప్రస్తుతం పనుల్లేని కారణంగా కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో శ్రీను, ప్రసాద్ ఉన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

నేరేడుచర్ల, జూలై 26 : మండలంలోని చింతకుట్ల జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, దీప్లానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, ప్రసాద్, దాసరి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'తేజ'లో ఒలింపిక్ వేడుకలు

కోదాడ రూరల్, జూలై 26 : పట్టణంలోని కొమరబండలో గల తేజ విద్యాలయంలో శుక్రవారం పారిస్ ఒలింపిక్ ప్రారంభోత్సవం సందర్భంగా వేడుకలు జరిపారు. విద్యార్థులు 25 దేశాల జాతీయ పతాకాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంతకు ముందు ఒలింపిక్ పితామహుడు పియరీ డి కూబెర్టిన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు, పోతుగంటి నాగేశ్వర్‌రావు, రమా సోమిరెడ్డి, ఎన్.నరసింహారావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 8గొర్రెలు మృతి

గరిడేపల్లి, జూలై 26 : మండలంలోని అప్పన్నపేట వద్ద శుక్రవారం లారీ ఢీకొని 8గొర్రెలు మృతి చెందాయి. మిర్యాలగూడెం మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి బోడయ్య కీతవారిగూడెంలో 110 గొర్రెలను కొనుగోలు చేసి అప్పన్నపేటలో వాటిని టాటాఏస్ వాహనంలోకి ఎక్కించేందుకు తోలుకుని పోతుండగా గ్రామంలోని వాటర్‌ట్యాంక్ వద్దకు రాగానే గొర్రెలు బెదిరి చెల్లాచెదురయ్యాయి. అందులో కొన్ని గొర్రెలు అటుగా వెళ్తున్న లారీ కిందకు వెళ్లగా వాటిలో 8 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

గుట్కా పట్టివేత

నడిగూడెం, జూలై 26 : మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో రూ.3,350 విలువ గల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఉపేందర్ కిరాణ దుకాణంలో గుట్కా నిల్వ చేశారనే సమాచారం ప్రకారం దాడులు జరుపగా గుట్కా ప్యాకెట్లు లభించినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు.

కోదాడ రూరల్ : ఆటోల్లో తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని నల్లబండగూడెం శివారు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద జగ్గయ్యపేట నుంచి కోదాడకు టీఎస్ 29 టీఏ 6134 నంబర్ గల ఆటోలో రూ.8వేల విలువైన, వెంకటేశ్వర్లు అనే వ్యక్తి టీఎస్ 04యూడీ 7171నంబర్ గల ఆటోలో రూ.2వేలు విలువ గల గుట్కా తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి ఆటోలను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ఇంట్లో చోరీ

తిరుమలగిరి, జూలై 26 : మున్సిపాలిటీలోని తిరుమల హిల్స్ నుంచి పద్మశాలి కాలనీ వెళ్లే దారిలోని 5వ వార్డులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటిలో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా గురువారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఇంటి యజమాని వచ్చి చూడటంతో బీరువా పగులగొట్టి, వస్తువులను చిందరవందర చేశారు. విలువైన వస్తువులు, డబ్బులు ఏమీ పోలేదు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగయ్య

మాట్లాడుతున్న ఉద్యాన వన శాఖ జిల్లా అధికారి నాగయ్య

చివ్వెంల, జూలై 26 : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగయ్య అన్నారు. మండల పరిధిలోని జి.తిరుమలగిరి రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన సాగు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన మండల అధికారి జగన్, ఏఈఓ పవన్, పతంజలి మేనేజర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి : ఎస్ఐ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేశ్

సూర్యాపేట అర్బన్, జూలై 26 : మానవ అక్రమ రవాణా చేయడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలుంటాయని ఎస్ఐ లోకేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లైంగిక దాడులు, ఇతర నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బడీడు పిల్లలను పనిలో చేర్చుకుంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత, నాగుల్ మీరా, శ్రీలక్ష్మి, అంజలి, సోమన్న పాల్గొన్నారు.

సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు, విద్యార్థులు

'విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి'

బొడ్రాయిబజార్, జూలై 26 : బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో నిరుద్యోగం, విద్యా అంశాలను గాలికొదిలేసిందని, 2,91,159కోట్లు బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,292 కోట్లు కేటాయించారని ఇవి ఏ మూలకు సరిపోతాయో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సింహాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రమేశ్, జిల్లా కోశాధికారి బండి రవి, వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, ఉపేందర్, వినోద్, రాజు, మధు పాల్గొన్నారు.

నేటి చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

బొడ్రాయిబజార్, జూలై 26 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాణోతు వినోద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కంపసాటి విష్ణు, ధరావత్ తన్వేశ్, అక్కినపల్లి వినయ్ ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు : సీఐ వెంకటయ్య

సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

మునుగోడు, జూలై 26: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు అని చండూరు సీఐ వెంకటయ్య అన్నారు. పోలీసు శాఖ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం పాఠశాలల విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. యువత అల్కహాల్ తీసుకోవడం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిందని, భవిష్యత్తును మర్చిపోయి జీవితాన్ని నాశం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మిమ్ముల్ని ప్రయోజకులను చేసేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారని, వారి ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, నాయకులు మల్లం మహేశ్, ఖమ్మంపాటి శంకర్, నాంపల్లి చంద్రమౌళి,మిర్యాల భరత్, వరికుప్పుల ముత్యాలు, వంశీ, శివ, రాజు, పాల్గొన్నారు.

హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి : డీటీడబ్ల్యూఓ

చందంపేట(దేవరకొండ), జూలై 26 : గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహించే వంట మనుషులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీటీడబ్ల్యూఓ రాజ్‌కుమార్ సూచించారు. శుక్రవారం గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే వంట మనుషులకు దేవరకొండలో నిర్వహించిన ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ గోపి పలు సూచనలు చేశారు. వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవడం పాటు తాజాదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ ఎం.శ్రీనివాస్, ఏసీఎంఓ డీవీనాయక్, వసతి గృహ అధికారి సైదానాయక్, రమేశ్‌నాయక్, లక్ష్మణ్, పరంజ్యోతి, పూలియా పాల్గొన్నారు.

శిథిలావస్థలో మునుగోడు ఎస్సీ హాస్టల్ భవనం

- కొత్త భవనానికి నిధులు కేటాయించాలని ఆందోళన

హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కేవీపీఎస్ నాయకులు

మునుగోడు,జూలై 26 : మండల కేంద్రం లో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హాస్టల్ విద్యార్థులతో ఆందోళన నిర్వహి చారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ మునుగోడు వసతి గృహంలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎప్పుడూ పెచ్చులూడుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను వెంటనే వేరే ప్రైవేటు భవనంలోకి మార్చాలన్నారు.

వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : ట్యాంకుల్లో నిల్వ నీటిని తొలగించాలని సూచిస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

తిరుమలగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయరాములు, సిబ్బంది

బొడ్రాయిబజార్, జూలై 26 : వర్షాకాలంలో ప్రజలు వారంలో ఒక రోజు డ్రైడే పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో ఆమె పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్ ఆకుల కవిత, బీఆర్ఎస్ నాయకులు ఆకుల లవకుశ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శివప్రసాద్, మెప్మా టీఎంసీ శ్వేత, వార్డు జవాన్ ఖ్రుద్దీన్, శ్రీపాది జానకిరాములు, బైరు వెంకన్న సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : చైర్‌పర్సన్ అనసూయ

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శాంగటి అనసూయరాములు అన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో పారిశుధ్యం-పరిశుభ్రతపై శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంపీడీఓ

నూతనకల్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండల కేంద్రం తోపాటు లింగంపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె పారిశుధ్య పనులను ప